సాక్షి
వికారాబాద్
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



ప్రజాభీష్టం మేరకే 'ఉపాధి'

వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. 8లో▸



అనంతగిరి: విద్యుత్ కాంతుల్లో వికారాబాద్‌లోని మెథడిస్టు చర్చి

న్యూస్‌రీల్

పార్కు స్థలం కబ్జాకు యత్నం!

- హయత్‌నగర్ మండలం మజ్దూర్ ఆర్టీసీ కాలనీలో ఆక్రమణ పర్వం
- అడ్డుకున్న కాలనీవాసులు.. అధికారులకు ఫిర్యాదు
- ఇక్కడ గజం రూ.40 వేల పైమాటే..

హయత్‌నగర్: భవిష్యత్తు అవసరాల కోసం పలు వెంచర్లలో పార్కుల పేరుతో ఖాళీగా వదిలేసిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కళ్లముందే విలువైన కబ్జాకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. హయత్‌నగర్ మండలం సర్వే నంబర్ 60/2 నుంచి 60/6 వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఏళ్ల క్రితమే ప్రభుత్వం ఈ భూములను ఆర్టీసీ ఉద్యోగులకు కేటాయించింది. ఇందులో మజ్దూర్ ఆర్టీసీ కాలనీ వెలిసింది. ఇప్పటికే ఇందులో నిర్మాణాలు చేపట్టిన వారు తమ ఇళ్లను, నోటరీలపై కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించుకున్నారు. వెంచర్ ఏర్పాటు సమయంలోనే పార్కు కోసం 800 గజాల స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. ఇటీవల ప్రభుత్వం ఈ సర్కార్ ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరిస్తుండటం, వరుసగా మూడు రోజుల పాటు అధికారులకు సెలవులు రావడం, బహిరంగ మార్కెట్లో ఇక్కడ గజం రూ.40 వేలకు పైగా ధర పలుకుతుండటంతో ఈ భూమిపై కబ్జారాయుళ్ల కళ్లుపడ్డాయి. కబ్జా చేసి ఏకంగా హద్దు రాళ్లు నాటించారు. స్థలంలో మట్టిని నింపి చుట్టూ తాత్కాలిక పలకలు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి పార్కు స్థలం కబ్జా కాకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహనతో మోసాలకు చెక్

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్

షాద్‌నగర్: చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటే మోసాలను అరికట్టవచ్చని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో వినియోగదారుల హక్కులు, విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాల గురించి తెలుసుకోవాలని తెలిపారు. ఎలాంటి కొనుగోళ్లు, లావాదేవీలు చేసినా విధిగా బిల్లులను తీసుకోవాలని సూచించారు. గ్యారంటీ, వారంటీ ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు ఇన్వాయిస్, ఇతర బిల్లులను చూపించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుల హక్కులకు చట్టపరంగా రక్షణ ఉంటుందని చెప్పారు. వినియోగదారుల హక్కు చట్టం 2019 ద్వారా న్యాయం పొందొచ్చన్నారు. కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉన్నప్పుడు, వ్యాపారులు మోసం చేసినప్పుడు వారిపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. తద్వార పరిహారాన్ని కోరే అవకాశం ఉంటుందన్నారు. వీటితో పాటు వినియోగదారులు తమ హక్కులకు సంబంధించిన పూర్తి వివరాలపై అవగాహన పెంపొందించుకుంటే వ్యాపారులు చేసే మోసాలను అరికట్టవచ్చని ఆయన వివరించారు. దుకాణాల్లో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందించాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాఖ్య ఫోరం సభ్యుడు నక్క బాల్‌రాజ్, గ్యాస్ డీలర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ధ్యాన సంబురాలు

కడ్తాల్: అహింస, ధ్యానం, సేవ, సత్యం అనే అంశాలకు కట్టుబడి, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ నిరంతరం పనిచేస్తుందని, పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఆదివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంగీత వేణునాద గానంతో ప్రాతఃకాల ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రి ప్రసంగించారు. అందరి లక్ష్యం ధ్యాన, శాఖాహార, అహింస పిరమిడ్ జగత్ అని అన్నారు. ఎంతో మంది నిరక్ష్యరాస్యులు సైతం అద్భుతంగా ధ్యాన ప్రచారాలు నిర్వహిస్తున్నారని.. ఇది ఎంతో గొప్ప విషయమన్నారు. పరిణీత పత్రి మాట్లాడుతూ.. ఆత్మజ్ఞానంతో ఆనందం, ఆరోగ్యం వెల్లి విరుస్తాయని తెలిపారు. అనంతరం స్పిరిచ్యువల్ ఇండియా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, ఓషో రజనీష్ రచించిన జీవిత రహస్యాలు, పండంటి రాజమణి త్రిగుణాత్ రచించిన అగ్నిస్పర్శ తదితర పుస్తకాలను పరిమళపత్రి, పరిణీత పత్రి ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు, పిరమిడ్ మాస్టర్లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. ఆదివారం కావడంతో ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు స్వర్ణమాల పత్రి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో తాండూరులోని మెథడిస్ట్ చర్చి

హ్యాపీ క్రిస్మస్

జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. వికారాబాద్, తాండూరు పట్టణాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. – తాండూరుటౌన్/అనంతగిరి



ముస్తాబైన తాండూరులోని సెయింట్ మార్క్స్ చర్చి

ఆగిన 'ఇంటిగ్రేటెడ్'



పరిగి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

మూడేళ్ల క్రితం సమీకృత మార్కెట్లు మంజూరు

- నాలుగు మున్సిపాలిటీల్లో పనులు
- 50శాతం కూడా పూర్తికాని వైనం
- అందుబాటులోకి వస్తే ఒకేచోట అన్ని సరుకులు లభించే అవకాశం

వికారాబాద్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు జిల్లాలో ముందుకు సాగడం లేదు. మూడేళ్ల క్రితం స్థలాలను పరిశీలించిన అధికారులు రెండేళ్ల క్రితం టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు సగం పనులు కూడా జరగలేదు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో (ఒక్కో మార్కెట్ నిర్మాణానికి) రూ. 3కోట్ల నుంచి రూ. 6కోట్ల వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఆయా మున్సిపాలిటీల సామర్థ్యం, అవసరాలను బట్టి రెండు నుంచి ఆరు ఎకరాల భూమిని కేటాయించారు. సమీకృత మార్కెట్ల నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగించింది. మొదట్లో పనులు వేగంగా సాగాయి. ఆ తర్వాత నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. నాలుగింటిలో ఒక్కచోట కూడా పనులు పూర్తి కాలేదు. కేవలం యాభై శాతం లోపే పనులు జరిగాయి.

గజ్వేల్ తరహాలో..

ఐదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. అధునాతన హంగులు, షాపింగ్ మాల్ తరహాలో ఈ సమీకృత మార్కెట్‌ను నిర్మించింది. ఇందులో అన్ని రకాల వస్తువులు, కూరగాయలు, మాంసం దుకాణాలు ఉండేలా ఏర్పాటు చేశారు. ఇది మంచి ఫలితం ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించాలని భావించారు. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ సామర్థ్యాన్ని బట్టి రూ. 3కోట్ల నుంచి రూ. 6కోట్ల వరకు వ్యయం చేయాలని నిర్మించారు. ఈ మార్కెట్లలో స్టాల్లు, పెద్దపెద్ద వాణిజ్య దుకాణాలు, బ్లాక్‌లు, సూపర్ మార్కెట్ల ఉండేలా నిర్మాణాలు చేపడతారు. ఒక్కసారి ఈ మార్కెట్‌కు వచ్చారంటే ఇంటికి అవరమయ్యే అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పూలు, చేపలు, మాంసం ఇలా ఒక్కటేమిటి అన్నీ లభ్యమయ్యే ఏర్పాట్లు చేస్తారు. దీంతో రోడ్లపై సంతలకు చెక్ పెట్టినట్లు అవుతుంది. తద్వారా ట్రాఫిక్ సమస్య తీరుతుంది. అంతే కాకుండా వ్యాపార పరంగా నగరం అభివృద్ధి చెందుతుంది. పలువురికి దుకాణాల ద్వారా ఉపాధి లభిస్తుంది. రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. ఇంతటి ఉపయోగం ఉన్న సమీకృత మార్కెట్ల నిర్మాణాన్ని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఇప్పటికైనా అధికారులు అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల సమస్యలను కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

28నుంచి 'ప్రజాపాలన'



సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: నగరంలోని సచివాలయంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమయ్యారు. రేషన్‌కార్డుల మంజూరు, ఆరు గ్యారంటీల అమలుపై చర్చించారు. అనంతరం కలెక్టర్ సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 28నుంచి వచ్చేనెల(జనవరి) 6వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలానికి రెండు టీంలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక టీమ్‌కు తహసీల్దార్, మరో టీమ్‌కు ఎంపీడీఓ లీడర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లో 40 టీమ్‌లు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డులు, అభయహస్తం కార్డుల కోసం అర్జీలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి పాల్గొన్నారు.

9న జానపద కళాకారుల సమ్మేళనం

బొంరాస్‌పేట: నగరంలోని రవీంద్ర భారతిలో జనవరి 9న తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సమ్మేళనం ఉంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం కృష్ణయ్య ఆదివారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని జానపద కళాకారులు తమ కళారూపాలతో హాజరుకావాలని కోరారు.



మల్లికార్జున స్వామి సన్నిధిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు

దైవ చింతనతో ప్రశాంతత

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డితో కలిసి కోట్‌పల్లి మండలం మోత్కుపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు దైవంతో సమానమని, వృద్ధాప్యంలో వారికి అండగా ఉండాలని సూచించారు. అనంతరం బార్వాద్ గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుభాష్ యాదవ్, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ గొడవలో మరో ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: బిగ్‌బాస్ గొడవలో జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 17న అన్నపూర్ణ స్టూడియోస్‌లో బిగ్‌బాస్ ఫైనల్స్ అనంతరం విజేత ప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్‌చౌదరి అభిమానులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి బస్సులు, కార్లను ధ్వంసం చేసి పోలీసులపై రాళ్లు రువ్వి విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్ అతడి సోదరుడు మహావీరంలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా శనివారం వీరిద్దరూ బెయిల్‌పై వచ్చారు. అలాగే ఈ విధ్వంసానికి పాల్పడిన 12 మంది అరెస్ట్ చేసి ఇప్పటికే రిమాండ్‌కు తరలించారు. తాజాగా సరూర్‌నగర్‌కు చెందిన హరినాథ్ రెడ్డి, యూసుఫ్‌గూడలకు చెందిన ఎం. సుధాకర్‌లను ఆదివారం రిమాండ్‌కు తరలించారు. పవన్ అనే మరో యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


అటకెక్కిన 'మాస్టర్ ప్లాన్'

- విధిలేక పాత ప్లానే అమలు
- కలగా మిగిలిన రింగ్ రోడ్డు
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పైనే ఆశలు

వికారాబాద్ అర్బన్: పట్టణంలో ట్రాఫిక్, రవాణా వ్యవస్థను మెరుగుపరచడం కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ దాదాపు పదేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మున్సిపల్ అధికారులు విధిలేని పరిస్థితుల్లో పాత ప్లాన్‌నే అమలు చేస్తున్నారు. వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడినా ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు. సుమారు లక్ష జనాభా ఉన్న పట్టణంలో మౌలిక వసతులు, రోడ్లు, పట్టణ సుందరీకరణ వంటి పనులు పెద్దగా జరగలేదు. పదిహేను సంవత్సరాల క్రితం ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉందని స్థానికులు అంటున్నారు. 2009లోనే వికారాబాద్ పట్టణం శాటిలైట్ టౌన్‌గా ఎంపికైంది. దీంతో పట్టణ రూపురేఖలు మారిపోతాయని ప్రజలు భావించారు. అయితే శాటిలైట్ టౌన్ కింద ఒక అండర్ డ్రైనేజీ పనులు మినహా మరో పనికాలేదు. శాటిలైట్ డేటాతో రెండో సారి ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపినా ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో అధికారులు పాత ప్లాన్‌నే అమలు చేస్తున్నారు. ఈ కారణంగా భవిష్యత్‌లో రహదారుల విస్తరణ, ప్రధాన రోడ్లలో ట్రాఫిక్, పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, జోన్‌ల ఏర్పాటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

అమలు కాని మాస్టర్ ప్లాన్

వికారాబాద్ పట్టణ అభివృద్ధికి 2014లో ఒక సారి, 2019లో మరోమారు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. సుమారు పది మంది ప్రత్యేక సిబ్బంది వచ్చి పది రోజుల పాటు ఇక్కడే ఉండి పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా శాటిలైట్ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి డీటీసీపీ కార్యాలయంలో సమర్పించారు. అయితే అది ఇప్పటి వరకు ఆమోదం పొందలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్ ఈ సారైనా మాస్టర్ ప్లాన్ అమలు చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వికారాబాద్ రింగ్ రోడ్డు నమూనా డ్రాఫ్టు

రింగ్‌రోడ్డు కోసం ఎదురు చూపులు

వికారాబాద్ పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని రెండు దశాబ్దాల క్రితమే అధికారులు గుర్తించారు. ఎన్నికల సమయంలో ప్రతి నాయకులు రింగ్ రోడ్డుపై హామీలు ఇస్తూ వస్తున్నారు. నేటికీ ఆ కల నెరవేర్చడం లేదు. ఏడాదికి ఒక సారి రింగ్ రోడ్డు సర్వే అయ్యిందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చారని చెబుతూ వస్తున్నా అమలు చేయడం లేదు. బీఆర్ఎస్ పార్టీ మొదటి సారి అధికారంలోకి వచ్చిన సమయంలో వికారాబాద్‌కు రింగ్ రోడ్డు మంజూరు చేసింది. అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి ఆ నిధులను తాండూరుకు తరలించారనే ప్రచారం కూడా ఉంది. ఏది ఏమైనా దశాబ్దాలు గడుస్తున్నా జిల్లా కేంద్రం ప్రజలు రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా జిల్లా కేంద్రం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుస్థితిలో ప్రధాన రోడ్లు

జిల్లా కేంద్రంలో ఏ రోడ్డును చూసినా దయనీయంగా కనిపిస్తోంది. ఆలంపల్లి ప్రధాన రోడ్డు, ఎన్టీఆర్ ఎక్స్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు, రామయ్య గూడ రోడ్డు, మహాశక్తి చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తి ఇరుకుగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనులకు అధికారులు ఒక్క అడుగు వేసినా వ్యాపారులు పోటాపోటీగా కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటున్నారు. బీజేఆర్, మహాశక్తి చౌరస్తాల్లో కనీసం ఆర్టీసీ బస్సులు తిరగడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ప్రధాన రోడ్లకు రెండు వైపులా పండ్ల వ్యాపారులు, తోపుడు బండ్లను పెట్టడంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బంది ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు గట్టి చర్యలు తీసుకొని రోడ్ల మరమ్మతు, విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రింగ్ రోడ్డు పనులు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఆదేశాలు రాలేదు

మాస్టర్ ప్లాన్ సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కొత్త వెంచర్లకు, కొత్త నిర్మాణాలకు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొనే అనుమతులు ఇస్తున్నాం. – జాకీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, వికారాబాద్



దోమ: పొగమంచు కారణంగా లైట్ల వెలుతురులో వెళ్తున్న వాహనాలు



పరిగి కూడలిలో..





కొడంగల్ రూరల్: పర్సాపూర్ ప్రధాన రహదారిలో..

కప్పేసిన పొగమంచు

దట్టమైన పొగమంచు కప్పేయడంతో పల్లెలు హిమాలయాల సౌందర్యాన్ని తలపిస్తూ, ఆనందాన్ని కలిగిస్తున్నా.. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటినా మంచుతెర తొలగలేదు. వాహన చోదకులు లైట్ల వెలుతురులో వెళ్లినా.. ఎదురుగా వచ్చే వారు కనిపించడం లేదు. దీంతో కొందరు రోడ్డు పక్కనే నిలిపివేయగా.. ఇంకొందరు వేగం తగ్గించి ముందుకు సాగుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

మీర్‌పేట: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బద్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్‌కు చెందిన రామిడి నర్సింహారెడ్డి, నీలమ్మ (62)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. నీలమ్మ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: ప్రమాదవశాత్తు విద్యుత్ టవర్‌ను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి కుర్మిద్ద గ్రామానికి చెందిన బైకని అశోక్(30) ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేసేవాడు. బైక్‌పై శనివారం రాత్రి మీరాఖాన్‌పేట నుంచి స్వగ్రామం కుర్మిద్దకు వస్తున్న క్రమంలో గ్రామ సమీపాన విద్యుత్ టవర్‌కు ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంపూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు తెలిపారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: పార్టీలకు అతీతంగా మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో సర్వే నంబర్ 1457, 1459లోని భూములను దేవాదాయ శాఖ నుంచి తొలగించడంతో సంబురాలు చేసుకున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష, కార్యదర్శి శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, పత్యనాయక్, పాండు నాయక్, పర్వతాలు, ఆరిఫ్, ఆనంద్, రాములు, యాదగిరి బాబు, కౌన్సిలర్ సోని, సింగల్ విండో వైస్ చైర్మన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే ‘ఉపాధి’

- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- ప్రజాధనం వృథా కాకుండా చర్యలు

దౌల్తాబాద్: వలసలు నివారించి, ఉన్న ఊరిలోనే పని కల్పించే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. ఈ మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2024–25) నుంచి చేపట్టే పనులను గుర్తించేందుకు అధికారులు ఇప్పటి నుంచే గ్రామాల్లో ఉపాధి గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ప్రజాభిప్రాయం మేరకు కూలీలకు ఏడాది పొడవునా పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అక్రమాలకు కళ్లెం

ఏటేటా స్థానకంగా పని కల్పిస్తుండడంతో పేద కుటుంబాల ప్రజలకు ఉపాధి లభిస్తోంది. గతంలో ఇష్టానుసారం పనులు చేపట్టడంతో ప్రజాధనం వృథా అయినట్లు సామాజిక తనిఖీల్లో వెలుగుచూసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. ఎలాంటి అక్రమాలు జరగకుండా పథకం అమలులో సమూల మార్పులు చేపట్టింది. అందులో భాగంగానే ముందుస్తుగా గ్రామసభలు చేపట్టింది.

ఊరూరా గ్రామసభలు

ఇంతకు ముందులా కాకుండా ఈ సారి గ్రామంలో మొదట గుర్తించిన 20 పనులు పూర్తయ్యాకే మిగతావి ప్రారంభించేలా నిబంధనను తీసుకువచ్చింది. దీని గురించి మండల పరిధి 33 గ్రామపంచాయతీలలో గ్రామసభలను ఏర్పాటు చేసి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను ప్రజల సమక్షంలో ఎంపిక చేస్తున్నారు. పూర్తయిన గ్రామాల వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

రూ.9.53కోట్ల పనులు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో మండల పరిధిలో రూ.09.53 కోట్ల విలువైన పనులు చేపట్టాలని తీర్మానించారు. మండలంలో మొత్తం 12,822 జాబు కార్డులుండగా.. కూలీలందరికీ ఏడాది పొడవునా పని దినాలను గుర్తించారు.

చేపట్టే పనులివే

ఉపాధి పథకంలో భాగంగా గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు కాలువలు, కుంటల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, కందకాలు తవ్వడం, మొక్కలు నాటడం, పండ్ల తోటల పెంపకం, కూరగాయల పందిళ్లు, పొలాలకు వెళ్లే రోడ్లు, పశువుల పాకల నిర్మాణం చేపట్టనున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలోనూ కూలీలకు పని కల్పించేలా అధికారులు పక్కాగా ప్లాన్‌తయారు చేస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితులను బట్టి వివిధ రకాల పనులు చేపట్టే వీలుంది.

జాబ్‌కార్డు ఉన్న వారికి..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామసభల్లో ప్రజా అవసరం మేరకే ఉపాధి పనులు గుర్తిస్తున్నాం. పని, బడ్జెట్, అంచనా వ్యవయంపై తీర్మానాలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని కల్పిస్తాం. చేపట్టే పనులపై ప్రణాళిక రచిస్తున్నాం.

– రంజిత్‌కుమార్, ఏపీఓ, దౌల్తాబాద్

ఘనంగా మహా పడిపూజ

పాల్గొన్న సభాపతి ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్

అనంతగిరి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో బారాది కృష్ణ–జగదీశ్వర్‌ల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప పాటలు ఆలపించారు. నైవేద్యం సమర్పించి ప్రత్యేక హారతి ఇచ్చారు. కార్యక్రమంలో స్పీకర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ చందర్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలె లక్ష్మణ్ గుప్తా, రాఘవేందర్, కల్వ లక్ష్మినారాయణ, విశ్వం పంతులు తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో సభాపతి తదితరులు

అసంపూర్తిగా బీటీ రోడ్డు పనులు

శంషాబాద్ రూరల్: రెండేళ్ల కిందట ప్రారంభించిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దారిలో కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఘాంసిమియాగూడ నుంచి శంకరాపురం వరకు ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు పనులు ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లు కొనసాగుతున్నాయి. బెంగళూరు జాతీయ రహదారి నుంచి చెర్లగూడ వరకు ఈ రోడ్డు పనులు చేపట్టారు.

‘పీఎంజీఎస్‌వై’ నిధులతో..

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో ఈ రోడ్డు పనులను 2021 జూలై 22న ప్రారంభించారు. రూ.2.82 కోట్లు అంచనా విలువతో పనులు చేపట్టగా.. రెండేళ్లు అయినా ఇంకా పూర్తి కావడంలేదు. ఘాంసిమియాగూడ శివారు నుంచి శంకరాపురం గ్రామం మీదుగా చెర్లగూడ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మట్టితో ఉండగా.. బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి.

కంకర దారితో ఇక్కట్లు..

రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి వదిలేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి బీటీ వేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. ఆరు నెలలకోసారి పనులు మొదలు పెట్టి కొద్దిగా పనులు చేసి వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు త్వరగా స్పంది సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

- ప్రజల రుణం తీర్చుకోలేనిది
- నిరంతరం అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కేశంపేట మండలం పాటిగడ్డ, కేశంపేట, అల్వాల్, మంగలిగూడ గ్రామాల్లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలు, అభినంద సభల్లో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో తనకు అండగా నిలిచి, ఘన విజయాన్ని అందించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల ప్రేమాభిమానాలే తనను గెలిపించాయని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారని తెలిపారు. వారందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కృషి చేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజారంజక పాలన అందిసుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్ర విశాల, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలను నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మైనార్టీ నేత ఇబ్రహీం, భాస్కర్ పాల్గొన్నారు.

అందరికీ అండగా ప్రభుత్వం

అన్ని మతాలు, కులాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కేశంపేట మండలం పా టిగడ్డ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌కట్ చేశారు. అనంతరం ప్రభుత్వం సర ఫరా చేసిన కానులను అందజేశారు. జెడ్పీటీసీ తాండ్ర విశాల, మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, ఇబ్రహీం ఉన్నారు.



కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

నవజాత శిశువులకు సురక్ష

- అందుబాటులోకి ‘నియోనేటర్ కేర్’ అంబులెన్స్‌లు
- ఆస్పత్రికి తరలిస్తూనే వైద్య సేవలు

కొడంగల్ రూరల్: నవజాత శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ‘నియోనేటర్ కేర్’ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఈ వాహనం శిశువుల పరిరక్షలో ఆపద్బాంధవిగా నిలువనుంది. శిశువుకు అనారోగ్య సమస్య వస్తే.. ఆగమేఘాల మీద మరో దవాఖానకు తరలిస్తూనే.. అధునాతన వైద్యం అందించేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. అందుకోసం ఈ వాహనాల్లో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా శిశు మరణాల రేటును తగ్గించడానికి వీటిని ఏర్పాటు చేసినట్లు 108, 104, 102 వాహన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత్ తెలిపారు. ఇవి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రి, ప్రసూతి కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ఎన్‌ఐసీయూ పరికరాలు



ఆస్పత్రి ఆవరణలో నియోనేటర్ కేర్ అంబులెన్స్

నియోనేటర్ కేర్ అంబులెన్స్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్‌ఐసీయూ)లో ఉండే పరికరాలు అమర్చారు. శిశువు శరీరానికి కావలసిన వేడిని అందించేందుకు రేడియెంట్ వార్మర్, కామెర్ల చికిత్సకు ఉపయోగించే ఫొటోథెరపీ యంత్రం, సరైన ఉష్ణోగ్రతను అందించే ఇంక్యుబేటర్, రెస్పిరేటరీతో పాటు బబుల్‌క్యాప్, ఆక్సిజన్ వెంటిలేటర్, పోషకాలు, మందుల తదితర వాటిని ఇందులో అందుబాటులో ఉంచారు. ఆక్సిజన్ సరఫరా చేసే హుడ్స్, శ్వాసక్రియను అందించే టాన్స్‌పోర్టు వెంటిలేటర్, శిశువు గుండె, శ్వాస రేటును ట్రాక్ చేసే కార్డియోపల్మోనరీ, పల్స్ ఆక్సీమీటర్ తదితర యంత్రాలతో ఈ నూతన వాహనాన్ని వినియోగంలోకి తెచ్చారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషయన్‌లను ఈ వాహనాల్లో విధులు నిర్వహించేలా నియామకం చేశారని వైద్య సిబ్బంది తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవల జిల్లాకు ఒక (నియోనేటర్ కేర్)అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

ఆపద్బాంధవిగా..



నూతన నియోనేటర్ కేర్ అంబులెన్స్‌లు నవజాత శివువులకు వరంలా మారనున్నాయి. ఇటీవల జిల్లాకు ఒక వాహనం కేటాయించారు. ఇందులో అధునాతన వైద్య పరికరాల ఉన్నాయి. డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా శిశు మరణాల రేటును తగ్గించడానికి ఉపయోగపడనున్నాయి.

– వసంత్, జిల్లా 108 వాహన ప్రోగ్రామ్ మేనేజర్

రోడ్లపై మురుగు.. పట్టించుకోని అధికారులు

అత్తాపూర్: సంవత్సర కాలంగా రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు లేరని ఉప్పర్‌పల్లి డైమండ్ అపార్ట్‌మెంట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగు పారటం, తీవ్ర దుర్వాసన వస్తుండటంతో డెంగీ, మలేరియా వంటి రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక సార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. రోడ్డు పైకి వెల్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెల్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలను తమ దృష్టికి ఎప్పటికపుడు తేవాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని మాటలు చెప్పే అధికారులు.. చేతల్లో మాత్రం ఆ పనితనం కనిపించటం లేదని డైమండ్‌హిల్స్ అపార్ట్‌మెంట్ వాసులు విమర్శించారు. ఇప్పటికైనా మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మల్లన్న కల్యాణంలో హర్యానా గవర్నర్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు అడికె రాజు నివాసంలో ఆదివారం జరిగిన మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని పూజాలు చేశారు. అనంతరం అడికె రాజు కుటుంబ సభ్యులు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు.

సర్వమతాల సంక్షేమానికి సర్కారు కృషి



క్రైస్తవులకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- క్రైస్తవులకు క్రిస్మస్ కానుకల అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: సర్వమతాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, కానుకులు పంపిణీ చేశారు. అనంతరం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేసి మాట్లాడారు. క్రైస్తవుల సంక్షేమానికి నాటి సీఎం, దివంగత నేత వైఎస్సార్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో చర్చిల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని, రావాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ అన్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రవంతి, ఆదిబట్ల చైర్‌పర్సన్ ఆర్తిక గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఉన్నారు.

జీఓ 317తో ఇబ్బంది

యాచారం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీఓ 317తో ఇబ్బంది పడుతున్నామని, దూర ప్రాంతాలకు బదిలీ కావడంతో స్థానికతపై ప్రభావం చూపుతోందని జీఓ స్థానికత సాధన సమితి తెలంగాణ బృందం ఆవేదన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. జీఓ వలన నష్టపోతున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనువాస్‌రావు, శ్రీశైలం, ఆర్థిక కార్యదర్శి చక్రపాణి, అసోసియెట్ అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, లింగస్వామి, కార్తీక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డిని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఫార్మాసిటీని రద్దు చేయించినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం

రాజేంద్రనగర్: తెలగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాజేంద్రనగర్ మండల స్థాయి తొలి సమావేశాన్ని ఆదివారం భవానీ కాలనీలో నిర్వహించారు. ఈ సమావేశంలో రామారావు, నాగేశ్వర్‌రావు, రాములు, సత్తయ్య, శోభారాణి, మహ్మద్ ముస్తఫాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ పెద్దలు బి.పరమేశ్వర్, కె.రామారావులను ఘనంగా సన్మానించారు.

ఇంట్లోనుంచి వెళ్లిపోయిన వ్యక్తి

అత్తాపూర్: ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం ఎంఎం పహాడీలో నివసిస్తున్న మహ్మద్ జావిద్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావటంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈనెల 10వ తేదీన ఎవరికీ చెప్పాపెట్టకుండా ఇంట్లోనుంచి వెళ్లి పోయాడు. పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.